క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వనపర్తి క్రైం: మండలంలోని రాజపేట పెద్దతండా పంచాయతీలో ఆయా వార్డులలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ జయరాములు ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్య, నార్య, బుచ్యా, బాబు తదితరులు ఉన్నారు.

శాగాపూర్‌లో డ్రైయినేజీ పనులు..

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో డ్రైయినేజీ పనులకు ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతయ్యయాదవ్, శ్రీను, చిన్నరవి, శివయ్య, భీమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టు పరీక్షలు



వనపర్తి క్రైం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే బెల్టు పరీక్షలను నిర్వహించారు. ముగ్గురికి రెడ్‌వన్, ఇద్దరికి బ్లూవన్, బ్లూబెల్ట్, ఏడుగురికి గ్రీన్ బెల్ట్, నలుగురికి ఎల్లో వన్, 20మందికి ఎల్లో బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసింహ, మాస్టర్ ప్రభాకర్, కోచ్ శివకృష్ణ, మహేష్ ఉన్నారు.
కొత్తకోట: మండలంలోని పాలెం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. 150మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లను సర్పంచ్ రాధ, సీడీసీ చైర్మెన్ చెన్న కేశవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయుడు, రామకృష్ణారెడ్డి, హలీం, పెంటన్న యాదవ్, నరేందర్‌సాగర్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి



వనపర్తి క్రైం: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. భవన నిర్మాణంలో వాడే ముడి సరుకుల ధరలను నియంత్రించాలని, అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన మోటార్ సైకిళ్లను నిర్మాణ కార్మికులకు వెంటనే ఇవ్వాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదుకు రేషన్‌కార్డు తప్పకుండా ఉండాలనే నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిక్సన్, రాబర్ట్, వెంకటయ్య, సతీష్, శ్రీను తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల చెందిన పులగురి అంజనమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికాగ ఆదివారం సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహ, వార్డు సభ్యుడు నరేష్‌కుమార్, సురేందర్‌రెడ్డి బాధితురాలికి రూ.15వేల సీఎం ఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

మంత్రిని కలిసిన తండావాసులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండలంలోని కుంటివానితండా, ఆర్యతండాలకు చెందిన గిరిజనులు ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలను వివరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తండాల్లో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. అభివృద్ధి కోసం అవసరమున్నా నిధులు మంజూరు చేయిస్తానని, ఇదివరకే బీటీ రోడ్డు మంజూరైనట్లు తనే స్వయంగా ఈనెల 21న వచ్చి శంకుస్థాపన చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తాటిపాముల సర్పంచ్ సత్యంయాదవ్, నవీన్‌రెడ్డి, చక్రవర్తి యాదవ్, బాల్‌రాం, లోక్యానాయక్, శివరాజు, అంజి, తిరుపతి, సేవ్యా, బుడ్డ బుచ్చన్న, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



సల్కెలాపురం శివారులో సాగు చేసిన మొక్క జొన్న పంట

- మండలంలో 78 ఎకరాల్లో..
- రెండు మూడు కంకులు వస్తుండటంతో రైతుల్లో ఆనందం

ఖిల్లాఘనపురం: మండలంలో యాసంగి పంటగా రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. తరుచుగా వరికి తెగుళ్ల బెడద ఎక్కువ కావడంతో ఈ సారి యాసంగి పంటగా మొక్క జొన్నను ఎంచుకున్నారు. సాగు చేసిన గ్రామాల్లో పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఆరుతడి పంటలు సాగు చేయాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసినా పట్టించుకోని రైతులు ఈ సంవత్సరం మొక్కజొన్న పంటను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. మంచి దిగుబడి వస్తే వచ్చే సంవత్సరం ఈ సాగు మరింత పెరిగే అవకాశం ఉంది.

78 ఎకరాల్లో సాగు..

మండలంలో ఎన్నడూ లేని విధంగా కాల్వల ద్వారా సాగు నీరు వస్తుండటంతో సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, మల్కిమియాన్‌పల్లి, ఉప్పరిపల్లి, షాపురం, సోళీపురంలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. మండలంలో గతేడాది కేవలం 10 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ సంవత్సరం 78 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట మార్పిడి వలన మంచి దిగుబడి వస్తుందని తద్వార రైతులు లాభాల బాట పడతారని తెలుపుతున్నారు.



అప్పారెడ్డిపల్లి లో..

పూత దశలో..



యాసంగిలో మొక్క జొన్న పంట సాగు చేయడం వలన మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పినా పట్టించుకోలేదు. కాల్వల నీరు వస్తుండటంతో మా ఊర్లో ఈ సంవత్సరం కొంత మంది మొక్క జొన్న పంట సాగు చేస్తుండటంతో నేను 4 ఎకరాల్లో సాగు చేశాను. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఒక్కో మొక్కకు రెండు, మూడు కంకులు పెద్దగా వస్తుండటంతో సంతోషంగా ఉంది.

–జంగం శేషయ్య, రైతు, అప్పారెడ్డిపల్లి

మంచి పరిణామం



మండలంలో వర్షాలు విస్తారంగా కురవడంతో పాటుగా కేఎల్ఐ నీరు వస్తుండటంతో ఎక్కువగా రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈ సంవత్సరం యాసంగిలో 78 ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉంది. రైతుల్లో ఇలాంటి మార్పుకోసం ఎదురు చూస్తున్నాం. తరుచుగా పంట మార్పిడి చేయడం వలన మంచి దిగుబడి వస్తుంది.

–మల్లయ్య, ఏఓ, ఖిల్లాఘనపురం

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పాండునాయక్

వీపనగండ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని 60 మంది ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. సోమవారం పోలింగ్ కోసం ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు.

దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలం



మాట్లాడుతున్న యాదవ నాయకులు

చిన్నంబావి: మండలంలో ఇటీవల వరుసగా మేకలు, గొర్రెలను ఎత్తుకెళ్తున్నా దొంగలను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని యాదవ జేఏసీ చైర్మన్ మేకల శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. మండలంలోని పెద్దదగడలో ఆడం చంద్రయ్యకు చెందిన 50 మేకలు చోరీకి గురై 20 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం పెద్దదగడలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. గొర్రెలు, మేకలను మేపుతూ జీవనం సాగించే యాదవ కుటుంబాలపై పనిగట్టుకుని దొంగతనాలు చేస్తున్నారని, ఇటీవల కాలంలో ఇది ఎక్కువైందన్నారు. విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించే వరకు బాధితుల తరుపున పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్, రాముడు యాదవ్, సాయిలు యాదవ్, రజినిబాబు యాదవ్, విష్ణుమూర్తి యాదవ్, ఆనంద్‌యాదవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి



గ్రంథాలను అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కొత్తకోట: భగవద్గీతలోని శ్రీకృష్ణుడు చెప్పిన మొట్టమొదటి శ్లోకంలో లోతుగా చెప్పిన జ్ఞానమును గ్రహించేందుకు ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రభోధ సేవాసమితి మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అమడబాకులలో ఆచార్య ప్రభోధానంద యోగీశ్వర్లు రచించిన ఆధ్యాత్మిక 100రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, జాంగీర్, రాములు, శేఖర్‌రెడ్డి, జయకృష్ణ, రాజు, లయ, శంకరమ్మ, మంజుల, దివ్య తదితరులు ఉన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై నిరసన



గోపాల్‌పేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



పెబ్బేరులో..



ఆత్మకూర్‌లో..

గోపాల్‌పేట: ఎమ్మెల్సీ కవితపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బండిసంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని గోపాల్‌పేట, రేవల్లి బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గోపాల్‌పేట, రేవల్లి ఎంపీపీలు సంధ్య, సేనాపతి, జెడ్పీటీసీలు భార్గవి, భీమయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో బండి సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా క్షమాపణలు చెప్పి మహిళలతో గౌరవంగా నడుచుకోవాలని అన్నారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, తిరుపతియాదవ్, కోదండం, రాములు, కోటిరెడ్డి, బాల్‌రాజు, రాజేష్‌చారి, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, వనంరాములు, దిలీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత: ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. దిష్టి బొమ్మను పట్టణంలో ఊరేగిస్తు బస్టాండ్ ప్రధాన రహదారిలో దహనం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ రాజు మాట్లాడుతూ.. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించని సంస్కృతి బీజేపీకే దక్కిందన్నారు. తెలంగాణ ఆడపడుచు ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ స్కాంలో భాగస్వాములంటూ లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. అనుచితంగా మాట్లాడిన బండి సంజయ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌సింగ్, రమేష్, నాగభూషణంగౌడ్, నరసింహులుగౌడ్ పాల్గొన్నారు.
ఆత్మకూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ పట్టణంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీను, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మసీద్ ప్రారంభోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో డాక్టర్ అజీమ్ సొంత నిధులతో నిర్మించిన మసీదును ఆదివారం సర్పంచ్ సతీష్‌కుమార్, కమిటీ అధ్యక్షుడు నసీర్, ఉప సర్పంచ్ వెంకటేష్, పలువురు కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ముస్లింలు ఇక నుంచి ప్రార్థనలు చేసుకునేందుకు సులువుగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బోధకులు అబ్దుల్ అజీజ్, ఖాజామజీద్, సాగర్, అంజనేయులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



ఆత్మకూర్: ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారు అక్కడ ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా పట్టణంలో వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

గోపాల్‌పేట: స్నేహితుడు మృతి చెందడంతో అతడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల వారితో పాటు చదివిన స్నేహితుడు శ్రీనివాస్‌చారి మృతి చెందాడని తెలుసుకున్న వారు తాడిపర్తిలో అతడి ఇంటికి వెళ్లి మాట్లాడారు. తక్షణసాయంగా రూ.80 వేలు ఆర్థికసాయం అందించారు. భవిష్యత్‌లో సైతం వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారి–44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎంను లారీ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారిపై డీసీఎం పైపులను తీసుకొని హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తుండగా.. అదేదారిలో ముంబయి నుంచి చెన్నై వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై జల్లాపురం శివారు ప్రాంతంలో ముందు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ డ్రైవర్ అనికేత్‌కు, డీసీఎం డ్రైవర్ రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం



మున్ననూరు చెరువులో దీపాలు వదులుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోపాల్‌పేట: మిషన్‌కాకతీయ పథకంతో గ్రామాల్లోని చెరువులకు పూర్వ వైభవం వచ్చిందని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువుల్లో ఆదివారం మిషన్ కాకతీయ పథకం ప్రారంభమై తొమ్మిది ఏళ్లు కావడంతో చెరువుల్లో దీపారాధన చేసినట్లు ఎంపీపీ సంధ్య తెలిపారు. చెరువులకు కొదవ లేదని, సీఎం కేసీఆర్ ముందుచూపు ఆలోచనతో గొలుసుకట్టు చెరువులను మరమ్మతు చేయించడంతో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని తెలిపారు. అనంతరం మున్ననూరు చెరువులో దీపారాధన చేశారు.

గంగమ్మకు పూజలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని పరుకోన్ చెరువులో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం దీపారాధన చేసి తెప్పోత్సవం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, ఉప సర్పంచ్ చీర్లసాగర్, వెంకటస్వామి, మహేష్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్, కృష్ణయ్య, సూరయ్య, శ్రీనివాసులు, కుర్మన్న, బాలయ్య, బాలస్వామి తదితరులు ఉన్నారు.



శ్రీరంగాపూర్‌లో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర



అలంపూర్ చౌరస్తాలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఉండవెల్లి: కర్ణాటక నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి భక్తులు పాదయాత్రగా అధిక సంఖ్యలో వెళ్తున్నారు. భక్తులు భక్తిగీతాలతో భజనలు చేసుకుంటూ మండుటెండలో ప్రయాణిస్తున్నారు. ఉగాది పర్వదినానికి శ్రీశైలానికి చేరుతామని భక్తులు తెలియజేస్తున్నారు.

భక్తులకు అన్నదానం..

మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఆదివారం అయ్యప్ప దీక్షా సేవ సమితి ఆధ్వర్యంలో ధర్మకర్త దామోదర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేద తీరడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

‘రిజర్వేషన్ల ఉనికికే ప్రమాదం’



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

అలంపూర్: దేశంలో రిజర్వేషన్ల ఉనికికి ప్రమాదం పొంచి ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు మారెన్న హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. దళితులపై దాడులు అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చూడాలన్నారు. రాజ్యాంగ రిజర్వేషన్లు రద్దు చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంతో రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దేశంలో గత తొమ్మిదేళ్లలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలియజేశారు. దళితులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పరంజ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, సవరన్న, అంజనేయులు తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి



మాట్లాడుతున్న కాశీనాథ్

నారాయణపేట టౌన్ : నిరుపేద ప్రజలకు రేషన్‌షాపుల్లో బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.కాశీనాథ్ అన్నారు. ఈ మేరకు పీవైఎల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామన్నారు. పీవైఎల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 వేల రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేసి పేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇక నుంచి సన్న బియ్యం ఇవ్వాలని, అదేవిధంగా వంట నూనె, పెసర, గోధుమపిండి, పంచదార, టీ పొడి, ఉప్పు, కారం, పసుపు, చింతపండు, పల్లీలు, సబ్బులు, వంట గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి, సబ్సిడీ కూడా ఎత్తివేశారని విమర్శించారు. తక్షణమే తమ డిమాండ్‌లు అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షులు సిద్దు, సహాయ కార్యదర్శి సలీం, సభ్యులు ఇస్మాయిల్, కొండప్ప, అంజిలప్ప, రవి, హన్మంతు, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.